# ప్రమదావనం

"రేపు మా బాబు పుట్టిన రోజు. మీ రిద్దరూ పార్టీకి రావాలి" అంటూ ఆహ్వానించారు నీరజా, ఆమె భర్తాను.

నీరజ నా స్నేహితురాలు. నీరజా వాళ్ళమ్మగారి ఇల్లూ, మా అమ్మగారి ఇల్లూ పక్క పక్కనే ఉన్నాయి. ఇద్దరమూ ఒకే వయసువాళ్ళం. దానితో చిన్నప్పటినించీ మా ఇద్దరికీ స్నేహం బాగా కుదిరింది. పెళ్ళిళ్ళయ్యాక భర్తల ఉద్యోగాలు కూడా ఒకే వూళ్ళో కావడం మా స్నేహాన్ని బలపరిచింది. ఎటువచ్చీ వాళ్ళ ఇంటికీ, మా ఇంటికీ దూరం కాస్త ఎక్కువ. అయినా ప్రతి వారానికీ ఒకరి ఇంటికి ఒకరు కనీసం ఒక్కసారైనా వెళ్ళి వస్తూంటాము. దానితో మా భర్తలకు కూడా బాగా పరిచయమైంది.

నీరజకు ఇప్పటికి బాబు ఒక్కడే. వాడి కిది మొదటి పుట్టినరోజు. మా కింకా పిల్లలు లేరు.

"చాలామందిని పిలుస్తున్నా రేమిటండీ?" అన్నారు శ్రీవారు.

"మా ఆఫీసు వాళ్ళను మాత్రం పిలుస్తున్నామండీ. మొదటి పుట్టిన రోజుకదా అని ఈ హడావుడి" అన్నాడు నీరజ భర్త.

కాస్సేపు ఈ కబురూ, ఆ కబురూ అయ్యాక వెళతామని లేచారు వాళ్ళిద్దరూ. నేను నీరజకు బొట్టు పెట్టాను.

"లక్ష్మీ! రేపు పార్టీ ఆరు గంటలకి. కానీ, నువ్వు మూడు గంటలకే వచ్చేసేయ్" అంది నీరజ.

"అయ్యో! అలా చెప్పాలా? సాయానికి నేను రెండు గంటలకే వస్తాను" అన్నాను.

మరునాడు శ్రీవారితో ఆఫీసు కాగానే నీరజా వాళ్ళ ఇంటికి రమ్మని చెప్పి, నేను అన్న ప్రకారం మూడు గంటల కల్లా వాళ్ళ ఇంటికి చేరుకున్నాను. ఇంచుమించుగా అన్ని అయిటమ్సూ బయటినుండే తెచ్చేశారు. చెయ్యడానికి కొద్దిగా ఉంటే చేసేసి అయిదయ్యేసరికల్లా నీరజా, నేనూ గెస్టుల నాహ్వానించడానికి తయారుగా ఉన్నాం. అయిదున్నర అయ్యేసరికి మావారూ, నీరజ భర్తా కూడా ఆఫీసుల నుండి వచ్చేశారు.

ఆరు అయ్యేసరికి ఒక్కొక్కరే రావడం మొదలు పెట్టారు. వచ్చిన వాళ్ళందర్నీ నీరజ నాకు పరిచయం చేస్తోంది. భార్యా భర్తలు, వారి పిల్లలు—అంతా కలిసి వస్తున్నారు కాబట్టి భార్య పరిచయం కాగానే ఆవిడ భర్త, పిల్లలుకూడా ఆనవాలు తెలుస్తున్నారు.

"ఈవిడ మిసెస్ నారాయణరావు. బి. ఎస్‌సి. పాసై బి. ఇడి. చేస్తున్నారు. ఈవిడ మిసెస్ సుబ్రహ్మణ్యం. ఎమ్. ఎ. కి ప్రైవేటుగా కడుతూంది. ఈవిడ మిసెస్ జగన్నాథం. బి. కామ్. పాసయింది" అంటూ ఒక్కొక్కరినే పరిచయం చేస్తూ, వాళ్ళకు ఉన్న డిగ్రీలు, తదితర అర్హతలు చెప్పుకుంటూ పోతూంది. వాళ్ళ డిగ్రీల గురించి నీరజ కాస్త ప్రత్యేకంగా చెప్పడానికి కారణం ఉంది. నీరజకు మెట్రిక్ లెవెల్‌లోకూడా చదువు లేదు. వ్రాయడం, చదవడం వచ్చు. ఇంగ్లీషుకూడా చదవగలదు. అంతే. తన చుట్టూ ఉన్నవారంతా బాగా చదువుకున్నారనీ, వారి మధ్య తను మామూలుగా వారిలో ఒకరిలా మసలగలుగుతున్నాననీ నాకు తెలియ జెయ్యడం దాని ఉద్దేశమై ఉంటుంది.

ఆఖరిని శ్రీమతి మీనాక్షిగారిని పరిచయం చేసింది. ఆవిడ భర్త కేశవరావు అయినప్పటికీ ఆమె శ్రీమతి కేశవరావుగా కాక ఆయన మీనాక్షి మొగుడుగా వినుతి కెక్కాడు. అందుకు కారణం—ఆమె ఒక రచయిత్రి కావడం. మీనాక్షిగారి గురించి నాకు నీరజ ఇదివరలోనే చెప్పింది. మీనాక్షిగారు నాకు మనిషి కొత్త అయినా ఆమె రచనలు నేను తరుచుగా చదువుతూనే ఉంటాను. రచనల మూలంగా ఆమె నాకు సుపరిచితురాలు.

ఆరున్నరకు అందరూ రావడం అయింది. ఏడు దాకా కబుర్లు చెప్పి అప్పుడు అందరికీ టిఫిన్ సెర్వ్ చేద్దామంది నీరజ. ఆడవాళ్ళందరూ ఒక చోట మగవాళ్ళంతా ఒక చోట కూర్చుని కబుర్లు చెప్పుకుంటున్నారు.

నేను ఆడవాళ్ళ మధ్య కూర్చున్నాను. స్వతహాగా నేను మితభాషిని. బాగా పరిచయం ఉన్న వారితో తప్ప మాట్లాడలేదు. అక్కడ నాకు నీరజ తప్ప బాగా తెలిసిన వాళ్ళెవ్వరూ లేరు. దానితో నేను అందరూ మాట్లాడుకునే మాటలు వింటూ కూర్చున్నాను.

మిసెస్ వెంకటేశం మిసెస్ సుబ్రహ్మణ్యానికి తను కొత్తగా కొన్న వాచీని చూపించింది.

మిసెస్ సుబ్రహ్మణ్యం దాన్ని చూసి పెదవి విరిచి, "ఇది మా అక్క కొంది. సరిగ్గా నెల రోజులు తిరగగానే పూర్తిగా పాడై పోయింది" అంది.

"మీ రే కంపెనీది కొన్నారో? ఇది ఇంపోర్టెడ్‌ది. ఏడాది గారంటీకూడా ఉంది" అంది మిసెస్ వెంకటేశం.

"మా అక్కా ఇంపోర్టెడ్‌దే కొంది. ఇంపోర్టెడ్ వన్నీ మంచి కంపెనీలు కావు. ఒక్కోసారి ఆ పేరుతో మోసాలుకూడా జరుగుతూంటాయి. ఈ పేరుతో ఒకడు వాచీలు తయారు చేసి ఇంపోర్టెడ్ వని షాపుల్లో అంటగడుతున్నాడట. మా అక్క వాచీ నెల్లాళ్ళలో పాడైపోతే దాన్ని రిపేరుకూడా చేయలేక షాపువాడు కొత్తది ఇచ్చాడు. అదికూడా వారాలే పనిచేసింది. ఇలా మూడు సార్లు జరిగేసరికి షాపువాడు దణ్ణం పెట్టేసి—'మీరు డబ్బున్న వారు. ఇది పాడైనా ఇంకోటి కొనగలరు. ఈ వెధవ కంపెనీని నమ్ముకుని ఇప్పటికి మూడు వాచీలు నష్టపోయాను. దయచేసి ఇంక వదిలెయ్యండి' అన్నాడు. మా అక్క జాలిపడి వదిలేసింది. అన్నట్లు మీ వాచీ కొని నెల్లాళ్ళయిందా?" అని అడిగింది మిసెస్ సుబ్రహ్మణ్యం.

"నెల కాలేదు. కానీ మూడు వారాలు దాటింది" అంది మిసెస్ వెంకటేశం.

"మూడువారాల్లో పోయేది మీరు తెచ్చుకోబోయే రెండో వాచీ లెండి!" అంది మిసెస్ సుబ్రహ్మణ్యం.

కాస్తో కూస్తో నేనూ రచయిత్రిని. మాటలను బట్టి మనుషుల మనస్తత్వాలు అంచనావేసి తరవాత సంఘటనలను బట్టి సరిపోల్చి చూసుకుంటూ ఉంటాను. వారిద్దరి మధ్యా నడిచిన సంభాషణను బట్టి నాకు ఒకటి అర్థమయింది. ఆ వాచీ కథ నిజమైనా, కాకపోయినా మిసెస్ సుబ్రహ్మణ్యం మాత్రం ఎదుటి వాళ్ళ వస్తువులకు ఏదో ఒక వంక పెట్టే స్వభావం కలది. సాధారణంగా అటువంటి వారి మెప్పు పొందడానికే ఎక్కువ మంది ప్రయత్నిస్తుంటారు. నూటికో కోటికో ఒకసారి పొగిడి మిగతా సమయాల్లో ఇలా తీసి పారేస్తూ ఉంటుం దావిడ. ఆవిడ మెప్పు కోసమే మిసెస్ వెంకటేశం ప్రయత్నించి ఫెయిలయింది.

ఈలోగా మిసెస్ అవధాని మిసెస్ వేదాంతాన్ని—"మీ చీర చాలా బాగుందండీ. ఎక్కడ కొన్నారు?" అని అడిగింది.

మిసెస్ వేదాంతం ఏదో చెప్పేలోగా, మిసెస్ సుబ్రహ్మణ్యం అందుకుంది. "మీ చీరకు పైన అంచు లేదండీ. పై అంచు లేకపోతే చీర బాగుండదు. అయినా ఇలాంటి చీర నేను పెళ్ళికి నెలముందు కొన్నాను. పెళ్ళి ఇంకా వారం రోజు లుండనగానే పిగిలిపోయింది ..."

ఈ విషయం ఆమె చెప్పవలసిన అవసరమేమిటో నాకు తెలియలేదు. అప్పుడే నాకు గుర్తు వచ్చింది—ఆమె ఎమ్. ఎ. కి ప్రైవేటుగా చదువుతూందని.

మిసెస్ వేదాంతం వూరుకోలేదు. "మీ చీర చవకరకం దయి ఉంటుంది లెండి. ఒకే రకం డిజైన్ రకరకాల క్వాలిటీస్‌లో వస్తుంది. మీ పెళ్ళికి ముందీ క్వాలిటీ లేదు. ఎందుకంటే ఈ రకం వచ్చి రెండు నెలలే అయిందని షాపు వాడు చెప్పాడు."



# పార్టీకి వెళ్ళిచూడు

—జొన్నలగడ రామలక్ష్మి

"షాపులవాళ్ళలాగే అంటారు లెండి. మొన్న ఒక షాపులో నైలెక్స్ చీర చూపించి, ఇది మార్కెట్‌లోకి వచ్చి మూడు వారాలు కూడా కాలే దన్నాడు'' అంది మిసెస్ సుబ్రహ్మణ్యం.

"షాపువాడు నా కెప్పుడూ అలా చెప్పడు. అయినా, వాళ్ళకు ముఖం చూడగానే తెలిసిపోతుంది—బట్టల నాణ్యం గురించీ, కొత్త ఫాషన్ల గురించీ తెలిసిన వారెవరో, తెలియని వారెవరో'' అంది మిసెస్ వేదాంతం.

వీళ్ళ మాటలు నాకు బోరనిపించి దృష్టి పక్కకు మరల్చాను.

అక్కడ నలుగురు మాట్లాడుకుంటున్నారు. మిసెస్ నారాయణరావు క్రికెట్ గురించి చెప్పేస్తూంది. మిసెస్ నరసింహం తను సంసారాన్ని ఎంత చక్కగా తీర్చి దిద్దుకుంటుందో, నలుగురూ తనను చూసి ఎంతలా ఆశ్చర్య పోతారో చెప్పేస్తూంది. మిసెస్ గోపి తన పిల్లల తెలివితేటల గురించి, వాళ్ళ కబుర్ల గురించి చెప్పేస్తూంది. మిసెస్ సత్యం సినిమాల గురించి చెప్పేస్తూంది. ఇంతకూ నలుగురూ ఒకరి మాట ఒకరు వినడం లేదు. ఎవరి ధోరణి వాళ్ళదే! ఒకరు చెప్పేది పూర్తి అయ్యేదాకా ఆగి, అప్పుడు తాము చెప్పదలుచుకున్నది చెప్పేస్తున్నారు.

వాళ్ళ సంభాషణ ఈ విధంగా నడుస్తూంది.

మిసెస్ నారాయణ: 'మా వారికి నిద్ర ఎక్కువ. కామెంటరీ వింటూనే జోగుతున్నారు. అప్పుడు గవాస్కర్ సిక్సర్ కొట్టాడు. నేను ఆనందం పట్టలేక పోయాను. కసీమని ఆయన వీపు మీద గట్టిగా చరిచాను. ఆయన ఉలిక్కిపడి లేచి ఏమిటయిందీ అన్నారు. గవాస్కర్ సిక్సర్ కొట్టాడు — అన్నాను. అబ్బా! చాలా గట్టిగా తగిలింది — అన్నా రాయన.'

నాకు నవ్వు వచ్చింది. వాళ్ళూ నవ్వుతా రను కున్నాను. మిసెస్ నారాయణరావు మాత్రం జోకు తనే చెప్పింది కాబట్టి నవ్వింది.

మిసెస్ నరసింహం: మా వారికి కంది పచ్చడి ఇష్టం. ఒక నెలాఖరు రోజున అది చేయమన్నారు. ఇంట్లో కందిపప్పు లేదు. నెలాఖరు రోజుల్లో ఉన్న దానితో గడిపేయడమే కానీ, సరుకులు ఫస్టు వచ్చే లోగా కొనడం నా కిష్టం ఉండదు. అప్పు చేయడం మొదలే ఇష్టం ఉండదు. అడిగింది చేయకపోతే ఆయనకు చాలా కోపం. అందుకని కాసేపు ఆలోచించాను. మంచి ఐడియా తట్టింది. ఇంట్లో శనగ పప్పు ఉంది. దానితో పచ్చడి చేసేశాను. ఆయన రుచులు పట్టడంలో అఖండులు. ఎలాగూ పట్టే స్తారు — అప్పుడు కాళ్ళట్టుకుని బ్రతిమాలవచ్చు అనుకున్నాను. అయితే ఆయన లొట్టలు వేసు కుంటూ తినేసి, కంది పచ్చడి ఇంత పాకాన ఎప్పుడూ పడలేదోయ్ — అన్నారు. ఫస్టు వచ్చాక ఆయనక నిజం చెప్పాను. నమ్మరే! నేను మరీ అంత ఫూల్ని కాను. నాకు రుచి తెలిసిపోతుంది. నువ్వు నన్ను ఏడి పించడాని కలా అంటున్నావు —అన్నారు. ఒక వేళ మళ్ళీ చేసి నమ్మిద్దామన్నా — చెప్పి చేస్తే ఆయన బాగా లేదంటారు. ఇంక వూరుకున్నాను. ఇంతకూ శనగపప్పుతో కంది పచ్చడి ఎలా చేశానో చెప్ప మంటారా?

ఎవరైనా చెప్పమని అంటారేమోనని మాత్రం ఆవిడ తన వాగ్ధాటి ఆపింది. ఆ అవకాశం కోసమే ఎదురు చూస్తూన్న —

మిసెస్ గోపి : ఈ రోజుల్లో పిల్లలు మరీ తెలివి మీరిపోతున్నారండీ! అందరూ అంతేలే — లేక మా వాళ్ళ ఒక్కరూ అలా ఉన్నారో — వెధవకు నాలుగేళ్ళు లేవా — ఆడుకుంటాడని పేక ఇస్తే అందులో రెండు ముక్కలు తక్కువ అయ్యాయని ఏడుపు. తీరా చూస్తే నిజంగానే అందులో రెండు ముక్కలు తక్కువ అయ్యాయి. ఎలా తెలిసిందో ఏమిటో వాడికి! ఆశ్చర్యంగా లేదూ?

మిగతావారి సంగతి ఎలా ఉన్నా, ఆ సంఘటన అప్పుడప్పుడు తను కల్పించ గలిగినందుకో, మరెందు వల్లనో మిసెస్ గోపికే ఆశ్చర్యం కలిగినట్లుంది. ఆ వ్యవధిలోనే అందుకున్నది —

మిసెస్ సత్యం: అంతా సినిమా పిచ్చి అంటారు మాకు. కానీ, వెధవది — ఇరవై నాలుగు గంటలూ ఇంట్లో కూర్చుని ఏం చేస్తాం, చెప్పండి? ఒక రోజు ఆకాశం బద్దలయ్యేటంత ఉరుములు, కళ్ళు మిరు మిట్లు గొలిపే మెరుపులు, ప్రపంచం కొట్టుకుపోయేటంత వాన — అయితే ఏం చేస్తాం? ఆ రోజు ఆదివారం. ఆదివారం నాడు సినిమా చూడక పోతే — ఇంకా సెల వెందుకు? నేనూ, ఆయనా గొడుగులు వేసుకుని సినిమాకు వెళ్ళాము. మా క్లాసుకు మే మిద్దరమే జనం. అసలు హాలు వాడు సినిమా మానేద్దా మనుకున్నాడట. ఇంత దూరంనించి వానలో వచ్చిన మమ్మల్ని చూసి జాలిపడి సినిమా వేసేశాడు. అందుకే కష్టే ఫలే అన్నారు ...

అప్పుడు మిసెస్ సత్యానికి దగ్గు వచ్చింది. అప్పుడు

మిసెస్ నారాయణరావు: నిజానికి గవాస్కరూ, విశ్వనాథ్ కలిసి వికెట్ల దగ్గర ఉండి బాగా ఆడిన సందర్భాలు చాలా తక్కువ. నా అదృష్టం కొద్దీ ఒక సారి నేను కామెంటరీ వింటున్నప్పుడు ...

ఇంక వాళ్ళ సంభాషణ విన బుద్ధి కాలేదు. ఒకరు చెప్పేది ఒకరు విననప్పుడు వాళ్ళసలు మాట్లాడు కోవడ మెందుకో అనివార్యతం అనిపించి దృష్టి మరొక పక్కకు మరల్చాను.

అక్కడ మిసెస్ జగన్నాథం తమ చుట్టాల పిల్లల్ని విమర్శిస్తూంది. వాళ్ళు చాలా అల్లరి వాళ్ళట. అన్నీ లాగేస్తారట. పెద్దవాళ్ళ మీద పడి కొడుతుంటా రట. ఆవిడ ఇలా అనగానే నాకు ఆవిడ పిల్లలెలా ఉంటారో చూడాలనిపించింది. అటు చూశాను.

నీరజ అందంగా షో కేసులో పెట్టిన బొమ్మను తీస్తున్నారు వాళ్ళప్పుడు. నీరజ వాళ్ళను తప్పమ్మా అది తీయకూడదు— అని నెమ్మదిగా

ప్రపంచం
సచిత్ర మాస పత్రిక
3237, రాష్ట్రపతిరోడ్, సికింద్రాబాద్-500003
1/8 డెమ్మీ సైజు వెల: రూ. 2.50
మార్చి '81 సంచిక వెలువడింది!
ఇందులో—
యద్దనపూడి సులోచనారాణి సీరియల్,
యండమూరి వీరేంద్రనాథ్ క్విజ్,
8 jjfi మీద ఆర్టికల్ + కథలు + మినీకథలు
కాక— పాఠకులకు ఎన్నో పోటీలు!
ప్రత్యేక నవలానుబంధం—
లల్లాదేవి
రచన
అగ్నిశిఖ
MARKETED BY ... ... ...
Margadarsi Marketing
PRIVATE LIMITED
EENADU COMPOUND, SOMAJIGUDA, HYDERABAD-500 004.

మందలిస్తూంది. అలా అంటే మిమ్మల్ని కొట్టేస్తాను ఆంటీ!—అని సంబోధనలో మన్నన ఉంచి ఛెళ్ళుమని నీరజను కొట్టిందా పిల్ల. రెండవ పిల్ల కోపంగానో, కసిగానో నీరజమీద ఉమ్మేస్తూంది.

ఇదంతా మిసెస్ జగన్నాథం చూస్తూనే ఉంది. నవ్వుతూ, "మా పిల్లలకు బొమ్మలంటే ఇష్టం" అంది నాతో.

నీరజకు బొమ్మలంటే ప్రాణం. అది అన్ని రకాల బొమ్మలూ కొని, చక్కగా షో కేసులో అలంకరిస్తుంది. అదసలు వాళ్ళ బాబుకే రబ్బరు బొమ్మలు తప్ప ఇవ్వదు. అలాంటిది ఈ మంచి బొమ్మలు వీళ్ళు తీసేస్తూంటే దాని మనసెలా ఉంటుందో నాకు తెలుసు. అందుకే ఒళ్ళు మండి, "మీ పిల్లలకి మీరు బొమ్మలు కొనరా?" అన్నాను.

"ఎందుక్కొననండీ? కానీ, పిల్లలకిస్తే పాడైపోతాయని—వాళ్ళకు అందకుండా దాచేస్తాను" అంది మిసెస్ జగన్నాథం.

పిల్లలకిస్తే పాడైపోతాయన్న విషయం ఆవిడకు తెలియదేమో ననుకున్నానని అందామనిపించి బాగుండదని వూరుకున్నాను. ఈలోగా పుస్తకాల గురించిన మాట విని దృష్టి అటు మరల్చాను.

మీనాక్షిగారు ఎవరితోటో ఇప్పుడు వస్తున్న పత్రికల గురించి మాట్లాడుతూంది. పుస్తకాలు, రచనలు—అంటే సహజంగా నాకు ఉన్న కుతూహలాన్నిబట్టి ఒక చెవి అటు పారేశాను. ఆవిడ కొన్ని పత్రికల్లో తెగ చెత్త రచనలు వస్తున్నాయనీ, కొన్ని మాత్రమే మంచి రచనలు వేస్తున్నాయనీ చెబుతూంది. ఆయా పత్రికల పేర్లు కూడా చెప్పిందావిడ.

ఆవిడ చెత్త అని తిట్టిన పత్రికల్లో ఎక్కువగా నా రచనలు వస్తూంటాయి. అంతేకాదు. వాటిలో ఆవిడ రచనలు చూసిన గుర్తు కూడా నాకు లేదు.

నేను తాపీగానే అడిగా—"ఆ చెత్త పత్రికలకు సర్క్యులేషన్ బాగుంది. పారితోషికాలు ఇస్తున్నారు. అలాంటప్పుడు మీలాంటివారు వాటికి వ్రాసి, వాళ్ళకు మంచి పేరు తేకూడదా?" అని అడిగాను.

"వాళ్ళే నన్నడుగుతున్నారు. మీ పత్రికలో రచనల స్థాయి నాకు సంతృప్తి కలిగించే స్థాయికి పెరిగేవరకూ నేను మీకు రచనలు పంపలేనని రాసేశాను" అంది మీనాక్షి.

ఈలోగా దీపావళి సంచికల ప్రసక్తి వచ్చింది. చాలా పత్రికలు ప్రతి దీపావళికీ హెచ్చు ధర పెట్టి ప్రత్యేక సంచికలు వేస్తుంటాయి. ఆ సంవత్సరం ఒక పత్రికలో నా కథ, మరొక పత్రికలో ఆవిడ కథా వచ్చాయి. ఆవిడ తన కథ వచ్చిన పత్రికను విపరీతంగా మెచ్చుకుని, నా కథపడ్డ పత్రికను "అంత డబ్బుపోసి పుస్తకం కొనుక్కొంటారుగదా - పత్రికలో కాసిని మంచి రచనలు వేయాలని తెలియదూ? మరీ అంత చెత్తగా తయారు చేశారేమిటండీ?" అంది.

నాకు రెండు పత్రికలూ ఒక్కలాగే ఉన్నాయి. కానీ, మీనాక్షిగారి ధోరణి నా కాశ్చర్యం కలిగించింది. రచయిత్రికదా—ఎదుటివారు తన గురించి ఏమను కుంటారోనని ఒక్క మాట కూడా ఆలోచించలేదా అనిపించింది. తెలివైనవారు తమను తాము పొగుడుకున్నా మరీ ఇంతలా దొరికిపోరు. ఈమాత్రం ఆలోచన లేని ఆవిడ అంత మంచి రచన లెలా చేస్తూందా అని నా కాశ్చర్యం కలిగించింది. బహుశా రచనలు చేసేటప్పటి వ్యక్తిత్వానికీ, సామాన్య వ్యవహారాల్లో వ్యక్తిత్వానికీ తేడా ఉండి ఉండవచ్చు.

ఎటువచ్చీ మీనాక్షిగారికి నేను రచయిత్రినన్న విషయం తెలియదు. అందువల్ల ఆవిడ మాటలు నన్ను నొప్పించడంకోసం అన్నవిమాత్రం కావు.

ఇంతలో నీరజ నన్ను రమ్మనమని సైగ చేయడంతో టిఫిన్ సర్దడానికి వెళ్ళాను.

అందరికీ టిఫిన్ ఇచ్చేయడం అయింది. కాఫీ కప్పుల్లో పోసి నేను, నీరజ ముందుగా మగవాళ్ళకు ఇస్తున్నాం. అప్పుడు నా చెవిని పడింది ఈ సంభాషణ.

ఒకాయన ఇంకొకాయన్ని అడుగుతున్నాడు—మీ అబ్బాయి పుట్టిన రోజు చెయ్యలేదేమండీ? అని.

దానికి అవతలాయన ఏదో జవాబు ఇచ్చాడు.

వెంటనే మొదటాయన- "పోనీలెండి. మీరు పార్టీ మానెయ్యడంవల్ల రక్షించబడ్డాం. ఈ వెధవ పార్టీలకు ప్రెజెంటేషన్స్ కొనలేక చస్తున్నా" అన్నాడు.

తరవాత ఆయన గురించి తెలిసింది. తన మనసులోని మాట ఎదుటివారి ముఖంమీదే కుండ బద్దలు కొట్టినట్లు చెబుతానంటాడట ఆయన. అది తనలో గర్వించదగిన ప్రత్యేకతగా భావిస్తాడట. అయితే, ఎవరైనా ఆయన ముఖం మీద కుండ బద్దలు కొట్టినట్లు మాట్లాడితే ఆయన ఏమాత్రమూ సహించలేడట.

నేను నీరజకేసి చూశాను. నీరజ నాకేసి చూసి వూరుకుంది.


అంతా వెళ్ళిపోయాక, పార్టీ ముగిశాక అడిగాను—"బాధపడ్డావా?" అని.

"లేదే. ఎవరి అభిప్రాయాలు వాళ్ళవి. మన సరదాకొద్దీ మనం చేసి, ఇంతవరకూ ఒకటే పార్టీ ఇచ్చాంకదా అనుకుంటాం. కానీ, వాళ్ళు ఇలాంటి పార్టీలు ఎన్నింటికి వెళ్ళాలో! అన్ని ప్రెజెంటేషన్స్ కొనడం వాళ్ళకూ కష్టమేకదా?" అంది నీరజ.

అప్పుడు నాకు నీరజ ఫస్టుఫారంలోనే చదువు ఆపేసిందన్న విషయం చటుక్కున గుర్తుకు వచ్చింది. వాళ్ళ బామ్మది చాదస్తం. ఓణీ వేసుకునే పిల్ల గడప దాటడానికి వీల్లేదందావిడ.

అక్కడ కూర్చుని మేము చర్చించిన దాన్నిబట్టి—మగవాళ్ళు కూడా సంభాషణల్లో ఆడవాళ్ళ కేమీ తీసిపోలేదని అర్థమయింది. నా భర్త, నీరజ భర్త అక్కడి సంభాషణల వివరాలన్నీ చెబుతూంటే నాకు అనిపించిన దేమిటంటే—పూర్వం చదువుకోనివారిలో సగంమందికైనా సంస్కారముంటే ఇప్పుడు చదువుకున్నవారిలో ఆమాత్రం కూడా సంస్కారవంతులు ఉండరని.

పార్టీకి వచ్చిన వారిలో ఆడ, మగ కూడా విద్యాధికులు. కానీ, వారి సంభాషణలన్నీ ఆత్మస్తుతి, పరనింద ఆధారంగా నడిచాయి.




మన దేశపు దౌర్భాగ్యానికి నిరక్షరాస్యులూ, విద్యావిహీనులూ కారకులని అభిప్రాయపడే వారెవరూ ఒక్కసారి ఇలాంటి పార్టీలకు వెళ్ళి చూస్తే—ఈ దేశాన్నెలా బాగుచేయాలో తెలియక గుండెలు బాదుకుంటారు.

ఆ పార్టీలో నేను నేటి పౌరుల్ని చూశాను. భావిపౌరుల్ని తీర్చి దిద్దుతున్నది వాళ్ళేనని గ్రహించాను.

దేశంలో ఏదైనా మార్పు వస్తుందేమోనని తెలుసుకోవడంకోసం పిలుపు అందిన పార్టీలకెల్లా వెళ్ళి వస్తున్నాను. ఇంతవరకూ నాకు ఎలాంటి మార్పూ కనపడలేదు.

మనుషుల ఆలోచనారీతులు తెలుసుకునేందుకు మీరూ పార్టీలకు వెళ్ళి చూడండి. మన దేశపు భవిష్యత్తు దారిమళ్ళే సమయాన్ని అంచనా వేయండి.

★